ఆర్టీసీ నిర్లక్ష్యం.. గ్రామీణులకు శాపం

ఆర్టీసీ బస్సులు గ్రామాలకు రాకపోవడం.. వచ్చినా సమయపాలన లేకపోవడంతో ప్రజలు త్వరితగతిన ప్రయాణాలు చేయాలని ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ మంది లేకుంటే తమకు గిట్టుబాటు ఉండదని ఆటో డ్రైవర్లు ఇష్టానుసారం ఎక్కించుకుని నడుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ప్రయాణికులు గాయాలపాల వుతున్నారు.

- గ్రామాలవైపు చూడని ఆర్టీసీ బస్సులు
- వేరే దిక్కులేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ప్రమాదపుటంచున ప్రయాణాలు


ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న గ్రామస్తులు

వెంకటాచలం : మండలంలో 25 గ్రామ పంచాయతీలుండగా 60 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. నిత్యం వివిధ పనుల కోసం ప్రతి గ్రామం నుంచి వందలాది మంది రాకపోకలు సాగించాల్సిందే. పల్లెలు కావడంతో కొందమందికి మాత్రమే కార్లు, ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. మిగతా వారంతా ఇతర వాహనాలపై ఆధారపడి ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. గతంలో ఆర్టీసీ బస్సులు 75 శాతం గ్రామాల్లో తిరిగేవి. ఈ బస్సుల్లో ప్రయాణించి తమ పనులు చేసుకునే వారు. కానీ కొన్నేళ్లలో ఆర్టీసీ బస్సులు పల్లెల ముఖం చూడడం లేదు. నష్టాల పేరుతో ఆర్టీసీ అధికారులు కొన్ని రూట్లలో బస్సులను పూర్తిగా నిలిపివేయడంతో మండలంలో సగానికి పైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. గతంలో గ్రామానికి రెండు బస్సులు తిరిగే చోట్లకూడా ప్రస్తుతం ఒక్క బస్సు కూడా లేని పరిస్థితి ఉంది.

గతంలో కిక్కిరిసేలా..

మండలంలోని దర్బులమిట్ట, తిక్కవరప్పాడు, మంగళంపాడు, జోసఫ్‌పేట, కందలపాడు గ్రామాలకు కిక్కిరిసిపోయే విధంగా ఆర్టీసీ బస్సులు తిరిగేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలకు బస్సులు రావడం లేదు. కందలపాడు గ్రామం నుంచి నిత్యం 30 మందికిపైగా విద్యార్థులు కసుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. గ్రామానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. ఆటోల్లో ప్రయాణం ప్రమాదమని తెలిసినా వేరే దారిలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని గ్రామాలకు బస్సులు పోతున్నా, సమయపాలన పాటించడం లేదు.

ప్రయాణికుల చూపు.. ఆటోల వైపు

ప్రస్తుతం వెంకటాచలం మండలంలో ఎక్కువ మంది ఆటోల్లో ప్రయాణించేందుకే ఇష్టపడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా తొందరగా గమ్యం చేరాలనే ఆలోచనతో ఆటోల్లో వెళ్తున్నారు. కొన్ని గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిచ్చే డబ్బులు తమకు డీజిల్‌కే సరిపోతాయని ఆటో డ్రైవర్లు అంటున్నారు. దీంతో ఒక్కో ఆటోలో పది నుంచి 20 మందికిపైగా ఎక్కించుకుని ఆటోలు తిప్పుతున్నారు. బస్సులు సక్రమంగా రానీ కారణంగా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తుండడంతో మండలంలో తరచూ ఆటో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ మంది ప్రయాణాలు చేయడం వల్ల కొన్ని రోడ్లపై ఆటోలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని వెంకటాచలం మండలంలో గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులు తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులేవీ?



గ్రామాలకు అవసరమైన ఆర్టీసీ బస్సులను అధికారులు తిప్పడం లేదు. కసుమూరుకు వచ్చే బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. గతంలో బస్సులు సక్రమంగా వచ్చేవి. బస్సులు రాని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కందలపాడుకు బస్సు తిరగడంతో చాలామందికి ఉపయోగపడేది. అధికారులు ఆలోచించి గ్రామాలకు బస్సులను తిప్పాలి.

– మందా కృష్ణ, కసుమూరు.

ప్రమాదాల బారిన పడుతున్నారు



ఆర్టీసీ బస్సులు గ్రామాలకు రావడం లేదు. దీంతో ప్రజలు ఎక్కువగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇలాంటి ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంటుంది. వేరేదారిలేక ఆటోల్లోనే వెళ్లాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకుని గ్రామాలకు అవసరమైన ఆర్టీసీ బస్సులు నడపాలి.

– వెంకటరమణయ్య, కురిచర్లపాడు


బస్సు రాకపోవడంతో ట్రాక్టర్‌లో పాఠశాలకు వెళ్తున్న కందలపాడు విద్యార్థులు


కందలపాడులో ఆటోల కోసం వేచి ఉన్న విద్యార్థులు

క్లుప్తంగా

నేడు శివాలయంలో కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు అత్యంత వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని దేవస్థానం ప్రధానార్చకుడు ప్రసాద్ స్వామి ఆదివారం తెలిపారు. కార్తీక మాసంలో మూడో సోమవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఫణీంద్ర శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకుని సలిపిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టి గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.

చీకటి పడితే రచ్చ రచ్చ


హెల్త్ సెంటర్ ఆవరణలో మందు బాటిళ్ల వ్యర్థాలు

విడవలూరు : మండలంలోని ముదివర్తి గ్రామంలో వాటర్ ట్యాంక్ సెంటర్ వద్ద మందు బాబుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గ్రామంలో వాటర్ ట్యాంక్ సెంటర్ ప్రధాన కూడలి. ఈ ట్యాంక్‌ను ఆనుకుని రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్, ఆలయం ఉంది. అయితే రోజూ సాయంత్రమయ్యే సరికి అదే గ్రామానికి చెందిన కొందరు మందుబాబులు అక్కడ ఉన్న హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మద్యం తాగి చిందులు వేస్తున్నారు. అంతే కాకుండా అక్కడే మల, మూత్ర విసర్జనలు చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయం అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు, హెల్త్ సెంటర్‌లోని సిబ్బంది వచ్చేసరికి అక్కడి పరిసర ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆయాలు, హెల్త్ సిబ్బంది నిత్యం పరిసరాలను శుభ్రం చేయలేక విసిగిపోతున్నారు.


అంగన్‌వాడీ కేంద్రం వద్ద..

ఆర్వో ప్లాంట్ మూత



ముత్తుకూరు : ముత్తుకూరు ప్రజలకు చౌకగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూతపడింది. సచివాలయం వద్ద ఏర్పాటైన ఈ ప్లాంట్ మూతపడడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటికి అధిక మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చౌకగా తాగునీరు అందించే ఒప్పందంపై ఓ ప్రైవేటు సంస్థ పంచాయతీ స్థలంలో గతంలో ఆర్వో ప్లాంట్‌ను నిర్మించింది. ప్రారంభంలో చౌకగా తాగునీరు అందించినప్పటికీ క్రమంగా ఈ ప్లాంట్ నిర్వహణ తగ్గి మూతపడింది.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కొడవలూరు : నార్సురాజుపాళెంలోని వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. వీటిని ట్రస్ట్ నిర్వాహకులు దొరడ్ల సత్యనారాయణ– లలితమ్మ దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది శీతాకాలంలో నిరాశ్రయులు, పేదలు ఇబ్బంది పడకుండా ట్రస్ట్ ద్వారా దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దొరడ్ల శశిధర్, వెంకట సుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచన లక్ష్మి పాల్గొన్నారు.

ఇస్కపాళేనికి శృంగేరి పీఠాధిపతి


మాట్లాడుతున్న విధుశేఖర భారతిస్వామి

వెంకటాచలం : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఉన్న సంస్కృత పాఠశాలను శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి ఆదివారం సందర్శించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థులతో ముచ్చటించారు. మంచి, చెడుల గురించి చిన్నతనం నుంచే తెలుసుకోవాలని, అభివృద్ధి వైపు ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాలు కీలకం


మొక్క అందజేస్తున్న అధికారులు

ఇందుకూరుపేట : వ్యాపార దక్షత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని జిల్లా సహకార శాఖాధికారి బి.గుర్రప్ప అన్నారు. ఇందుకూరుపేటలో జరిగిన సహకార వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంలో జరిగిన వారోత్సవాలకు ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పీఏసీఎస్ సంఘాలను బహుళ ప్రయోజన సేవా కేంద్రాలుగా మారుస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌ల పరిధిలో పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ గ్యాస్ డీలర్‌షిప్పుల మంజూరు, జనరిక్ మందుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘ పర్సన్ ఇన్‌చార్జి ప్రభాకర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక ఆదాయం



విడవలూరు : ప్రకృతి సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని డీపీఎం డి.మాలకొండయ్య అన్నారు. మండలంలోని వావిళ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ సిబ్బందితో ఆయన ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన జీవామృతం, బీజా మృతం, ద్రవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్ర, ఓంకార్, కోటేశ్వరరావు, వంశీ, ప్రసాద్, విజయసింహ, మల్లికార్జున, సుబ్బయ్య పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో ప్రసన్న, ఆదాల

కోవూరు : కొడవలూరు మండలం మానేగుంటపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వాసా గోపాల్‌రెడ్డి– పద్మావతమ్మ మనుమరాలు జాహ్నవిరెడ్డి– హేమంత్‌రెడ్డి వివాహ వేడుక ఆదివారం నెల్లూరులో జరిగింది. ఈ వేడుకకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు తదితరులు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

తెలిక‌పాటి వర్షాలకే గుల్లగుల్ల


గుల్లగుల్లగా మారిన వెంకన్నపాళెం రహదారి


వెంకన్నపాళెం రోడ్డులో గుంతల్లో నిలిచిన నీరు


దుస్థితికి చేరిన వరకవిపూడి-అనంతపురం రహదారి

తోటపల్లిగూడూరు : మండలంలోని తీరప్రాంతాలైన వెంకన్నపాళెం, కొత్తపాళెం, పోట్లపూడి, కోడూరు, మాచర్లవారిపాళెం గ్రామాల్లో పంచాయతీరాజ్‌శాఖ రహదారులు అస్తవ్యస్తంగా మారిపోయాయి. ఇదివరకే దుస్థితిలో ఉన్న రహదారులు ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలకు రూపురేఖలు కోల్పోయాయి. ముఖ్యంగా మహాలక్ష్మీపురం నుంచి వెంకన్నపాళెం మీదుగా కొరుటూరుకు వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారిపోయింది. అలాగే వరకవిపూడి నుంచి అనంతపురం వరకు ఉన్న తారురోడ్డు గుల్లగుల్లగా తయారైంది. సీఎస్ పురం నుంచి కాటేపల్లి వరకు ఉండే పంచాయతీ రోడ్డు మరీ అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలు, ఆటోలు ఈ మార్గాల్లో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది.

తెలుగు కవుల సేవలు చిరస్మరణీయం


కొడవలూరు : యల్లాయపాళెంలో తెలుగు కవుల గొప్పతనాన్ని వివరిస్తున్న వక్తలు


కొడవలూరులో తెలుగు కవుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చిన్నారులు

కొడవలూరు : తెలుగు సాహిత్యానికి కవులు అందించిన సేవలు చిరస్మరణీయమని హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.రాజేష్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో తెలుగు కవులు గుర్రం జాషువా, శ్రీశ్రీల చిత్రపటాలకు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి సేవలందించిన మహనీయులను గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్మరించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కొడవలూరులో..

కవుల గొప్పతనం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గ్రంథాలయ అధికారి కె.రాజేశ్వరి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో తెలుగు కవుల గొప్పతనంపై ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కవులు రచించిన గ్రంథాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, నీతి, నిజాయితీలు పెంపొందుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

సాహిత్యమే భాషకు శ్వాస

బుచ్చిరెడ్డిపాళెం : సాహిత్యమే భాషకు శ్వాస అని, పిల్లలకు తెలుగుభాష పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని రచయిత కొరప్రాటి వెంకటరమణయ్య అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో ఆదివారం వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేసిన కవులు, రచయితల గురించి నేటితరం వారు తెలుసుకోవాలన్నారు. అనంతరం కవులు, రచయితలైన కొరప్రాటి వెంకటరమణయ్య, తాటిపర్తి వెంకటేశ్వర్లు, కుమారస్వాములను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.మంజులత, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

- **విడవలూరు :** స్థానిక లైబ్రేరీలో గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నిరూప కవులు, రచయితల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో శేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విడవలూరు గ్రంథాలయంలో..


బుచ్చిరెడ్డిపాళెంలో కవులకు సన్మానం

ఆదమరిస్తే ప్రమాదమే..


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మనుబోలు : మండల పరిధిలోని బద్దెవోలు–కొలనకుదురు రోడ్డులో బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాల మధ్య ఉన్న ఓ మలుపు వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ కండలేరు ఉప కాలువపై ఉన్న కల్వర్టు చాలాకాలం క్రితం నిర్మించింది కావడంతో పిట్టగోడ పూర్తిగా కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మోటర్‌సైక్లిస్టులు మృతిచెందగా పదుల సంఖ్యలో గాయపడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు పిట్టగోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నిమ్మతోటల్లో రొచ్చురొచ్చు


మండలంలోని అయ్యగారిపాళెంలో రొచ్చుగా మారిన నిమ్మతోట

పొదలకూరు : సుమారు వారం రోజులుగా వీడకుండా కురుస్తున్న వర్షం వల్ల నిమ్మతోటలు రొచ్చురొచ్చుగా మారాయి. నిమ్మమార్కెట్‌కు వారం రోజులుగా సక్రమంగా కాయలు రావడం లేదు. పెద్ద వర్షం కాకున్నా విడతల వారీగా వర్షం కురుస్తుండడం వల్ల తోటల రైతులు బేజారెత్తుతున్నారు. కాలు పెట్టేందుకు కూడా వీలులేనంతగా తోటలు బురదమయంగా మారుతున్నాయి. ఫలితంగా తోటల్లో కాయలు ఉన్నా బురదలో కోసేందుకు వెళ్లాలంటే వీలుపడడం లేదంటున్నారు. దీంతో నిమ్మతోటల రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వరినారు మళ్లకు కూడా వర్షం వల్ల నష్టం వాటిల్లినట్లు రైతులు వెల్లడించారు. వీడని వర్షం వల్ల సక్రమంగా నార్లు మొలకెత్తలేదంటున్నారు. తిరిగి మళ్లీ నార్లు పోసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు.